క్లుప్తంగా

సత్తుపల్లి సీఐగా శ్రీహరి



మంత్రి తుమ్మలకు పుష్పగుచ్ఛం అందిస్తున్న సీఐ శ్రీహరి

సత్తుపల్లి: సత్తుపల్లి సీఐగా నియామకం పొందిన తుమ్మపల్లి శ్రీహరి గురువారం రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావును దమ్మపేట మండలం గండుగులపల్లిలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అదే విధంగా స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్‌లను వారి నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందించారు. కాగా సత్తుపల్లి సీఐగా పని చేస్తున్న టి.కిరణ్ ఐజీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ బదిలీ అయిన సంగతి తెలిసిందే.

సమ్మెను విజయవంతం చేయండి

సత్తుపల్లిరూరల్: జూలై 9న జరగనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. గురువారం స్థానిక నీలం రామచంద్రయ్య భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో నాయకులు శరత్, రామకృష్ణ, సర్వేశ్వరరావు, శ్రీనివాసరావు, ఆదినారాయణ, యోబు, రాజబాబు, రమేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు లైఫ్ స్కిల్స్ సర్టిఫికెట్లు అందజేత

వైరా: స్థానిక న్యూలిటిల్ ఫ్లవర్ కళాశాల విద్యార్థులకు గురువారం ఐఐటీ మద్రాస్ ఆధ్వర్యంలో లైఫ్ స్కిల్స్ సర్టిఫికెట్లను కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ పోతినేని భూమేశ్వరరావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్‌లో ఇంజనీరింగ్ పూర్తి అయిన తర్వాత ఈ సర్టిఫికెట్లు ఎంతో ఉపకరిస్తాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కూర్రా సుమన్, ప్రిన్సిపాల్ భువన ప్రసాద్, షాజీ మాథ్యూ, ఏఓ నర్సింహారావు తదితరులున్నారు.

బీఎల్ఓలకు శిక్షణ

ముదిగొండ: ముదిగొండలోని రైతు వేదికలో గురువారం బీఎల్ఓలకు, అధికారులకు, సూపర్‌వైజర్‌లకు ప్రొజెక్టర్ ద్వారా ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎలక్షన్ కమీషన్ ద్వారా ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో రానున్న ఎలక్షన్‌లో బీఎల్‌ఓలు పాత్ర కీలకమైందని, ప్రతి ఒక్క బీఎల్ఓ తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. ఓటర్లకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించాలని ప్రొజెక్టర్ ద్వారా తెలుసుకున్నారు. వీఈఎం, వీవీ ప్యాట్ నిర్వహణ, ఇతర అంశాలపై అవగాహన కలిగి ఉండాలని తెలియజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సునిత ఎల్జిబెత్, డీటీ లక్ష్మి, ఆర్ఐలు, బీఎల్ఓలు పాల్గొన్నారు.

బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

చింతకాని: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న బీమా పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని యూనియన్ బ్యాంక్ మేనేజర్ రాయల దయాకర్ తెలిపారు. గురువారం మండలంలోని బస్వాపురం యూనియన్ బ్యాంక్ బ్రాంచ్‌లో లబ్ధిదారులకు బీమా చెక్కులను అందించి మాట్లాడారు. బస్వాపురం గ్రామానికి చెందిన పొల్ల కుటుంబరావు, లచ్చగూడెంకు చెందిన పోలంపల్లి లక్ష్మీనారాయణ రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. వీరు బ్యాంక్‌లో పీఎం సురక్ష బీమా యోజన పథకం తీసుకున్నందున నామినీలు పొల్ల వెంకయ్య, పోలంపల్లి రాశి లకు రూ.2లక్షల బీమా చెక్కులు అందించారు. కార్యక్రమంలో బ్రాంచ్ డిప్యూటీ మేనేజర్ శివకుమార్, బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాయినాథుడికి ప్రత్యేక పూజలు

ఏన్కూరు: మండల కేంద్రంలో సాయిబాబా మందిరం 26వ వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించి.. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎర్రుపాలెం మండలంలో..



భక్తులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

ఎర్రుపాలెం: మండలంలోని తక్కెళ్లపాడు, భీమవరం, ఎర్రుపాలెం గ్రామాల్లోని సాయిబాబా ఆలయాల్లో స్వామివారికి గురువారం అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. సాయిబాబా విగ్రహాలకు పంచామృతాలతో అభిషేకాలు చేసి శ్రీసాయికి కర్పూర హారతులతో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. మండలకేంద్రంలోని సాయి ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నెరవేరనున్న దశాబ్దాల కల

- పూర్తి కావొస్తున్న మేడేపల్లి వంతెన పనులు
- కొనసాగనున్న రాకపోకలు
- ఎన్నికలు బహిష్కరించి సాధించుకున్న వైనం..
- ఆనందంలో గ్రామస్తులు



కొనసాగుతున్న మేడేపల్లి వంతెన నిర్మాణ పనులు

ఏన్కూరు: ఎన్నో ఏళ్లుగా బ్రిడ్జి లేక రాకపోకల సమయంలో ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు సహనం నశించి ఎన్నికలు బహిష్కరించి మరీ తమ సమస్యను పరిష్కరించుకున్నారు. బ్రిడ్జి నిర్మాణంతో దశాబ్దాల కల నెరవేరనుంది.

వర్షం వస్తే ఇక్కట్లు..

మండల పరిధిలోని మేడేపల్లి గ్రామానికి సమీపంలో వాగుపై ఉన్న వంతెన ఎత్తు తక్కువగా ఉండడంతో వర్షం వచ్చినప్పుడల్లా వంతెన పై నుంచి వరద ప్రవహించేది. దీంతో గ్రామస్తులు రాకపోకల సమయంలో అనేక ఇబ్బందులు పడేవారు. కాలనీనాచారం, నాచారం, భద్రుతండ, రామతండ, మున్యాతండ, ఒంటిగుడిసె గ్రామాలకు వెళ్లాలంటే మేడేపల్లి లోతట్టు వంతెన నుంచే వెళ్లాల్సి ఉంటుంది. ఒకవేళ వాగు పొంగితే.. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, పొలాలకు వెళ్లే రైతులు, వ్యాపారస్తులు, ఆస్పత్రులకు వెళ్లే రోగులు, తదితర ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి పరిస్థితి ఏర్పడింది.

ఎన్నికల బహిష్కరణతోనే..

వంతెన కావాలని పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టికి తీసుకెళ్లినా.. వారు స్పందించకపోవడంతో మేడేపల్లి వాసులు 2009లో మొట్టమొదటి సారి వైరా అసెంబ్లీ ఏర్పడినప్పుడు ఎన్నికలు బహిష్కరించి లోతట్టు బ్రిడ్జిపై బైఠాయించారు. వంతెన నిర్మించాలని భీష్మించుకుర్చున్నారు. స్థానిక అధికారులు నచ్చచెప్పినప్పటికీ వినిపించుకోకుండా.. కలెక్టర్ వచ్చి హామీ ఇచ్చేవరకు ఓట్లు వేసేది లేదన్నారు. విషయాన్ని అప్పటి కలెక్టర్ ఉషారాణి దృష్టికి తీసుకురాగా.. స్పందించిన ఆమె బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అప్పటి నుంచి పలువురు కలెక్టర్లు మారారు.

ముమ్మరంగా పనులు..

ఎట్టకేలకు 16 సంవత్సరాల తరువాత.. ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన పథకం కింద రూ. 4.5 కోట్లు నిధులు మంజూరు కాగా.. 18-01-25న బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. 18-07-2026 వకు నిర్మాణం పూర్తి చేయాల్సి ఉంది. ప్రస్తుతం బ్రిడ్జి నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. వంతెన నిర్మాణం పూర్తి అయితే వర్షాకాలంలో కూడా పలు గ్రామాలకు రాకపోకలు కొనసాగుతాయి. దీంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నికలు బహిష్కరించాం..



వర్షాకాలం వచ్చిందంటే చాలు వాంగు పొంగి ప్రవహిస్తుంది. దీంతో పలుగ్రామాలకు రాకపోకలు నిలిచిపోతాయి. 2009లో అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరించి బ్రిడ్జిపై ధర్నా చేశాం. కలెక్టర్ ఉషారాణి వచ్చి వంతెన మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఇన్ని సంవత్సరాల తరువాత మా కోరిక నెరవేరింది.

– బండ్ల చిన్న జోగయ్య, మాజీ సర్పంచ్

పొలం పనులు ఆగిపోతాయి..



వర్షకాలంలో వాగు పొంగినప్పుడు కొన్ని రోజుల వరకు పొలాలకు వెళ్లని పరిస్థితి. మా పొలాలన్నీ వాగు అవతలనే ఉన్నాయి. మా పిల్లలు కూడా పాఠశాలకు వెళ్లే పరిస్థితి లేదు. బ్రిడ్జి నిర్మాణంతో మా గ్రామంతో పాటు పలు గ్రామాల సమస్యలు తీరుతాయి. నిర్మాణం పూర్తి అయితే వర్షాకాలంలో ఇబ్బందులు కూడా ఉండవు.

– పూనెం నాగేశ్వరరావు, రైతు, మేడేపల్లి

పేదల పక్షపాతి.. కాంగ్రెస్ ప్రభుత్వం



వైరా: ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందిస్తున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్

వైరా: రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ నిరుపేదల పక్షపాతిగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని సీఎం రేవంత్‌రెడ్డి నిరూపించినట్లు ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ అన్నారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మున్సిపాలిటీ పరిధిలో 390మంది లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పట్టాలను అందించి మాట్లాడారు. ఇళ్ల పట్టాలు రాని ఏ ఒక్కరు ఆందోళన చెందాల్సిన పని లేద, అందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చే బాధ్యతను తానే తీసుకుంటానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి చూసి ఓర్వలేక బీజేపీ, బీఆర్ఎస్‌లు పనికిమాలిన విమర్శలు చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి రంగారావు, పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు వెంకటనర్సిరెడ్డి, సీతారాములు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

వైరారూరల్: 'పది'లో ప్రతిభ చూపిన మండలంలోని వివిధ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ నగదు ప్రోత్సాహకాలు అందించారు. గురువారం మండలంలోని రెబ్బవరం జెడ్పీహెచ్ఎస్‌లో.. అష్టగుర్తి సువిధ ట్రస్ట్ ఆధ్వర్యంలో పాఠశాలల్లో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5వేలు అందించడంతోపాటు, మండలంలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన తిరుమలదాసు మాధురికి రూ.6వేలు, షేక్.జమీనాకి రూ.4వేలను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందించారు. ట్రస్ట్ బాధ్యులు నాగేశ్వరరావు, వెంకటి, ఎంఈఓ వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకటర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నానో యూరియాను వాడుకోవాలి



చింతకాని: అవగాహన కల్పిస్తున్న మధిర ఏడీఏ విజయ్ చంద్ర

చింతకాని/బోనకల్: పంటల సాగులో ద్రవ రూపంలో ఉండే నానో యూరియాను వాడుకోవాలని మధిర, బోనకల్ ఏడీఏలు విజయ్ చంద్ర, పసునూరి వినయ్‌కుమార్ సూచించారు. చింతకాని మండలంలోని లచ్చగూడెం గ్రామంతో పాటుగా.. బోనకల్ మండలంలోని చిరునోముల, బోనకల్, రావినూతల, బ్రాహ్మణపల్లి గ్రామాల్లో లలో నానో రియా వాడకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నానో యూరియా వాడకం వలన మొక్కకు పోషకాలు ఎక్కువ మోతాదులో అందుతాయని, ఖర్చు తక్కువ అవుతుందని తెలిపారు. పర్యావరణానికి అనుకూలంగా ఉండటమే కాకుండా గ్రీన్‌హౌస్ వాయువులుగా వాతావరణంలో కోల్పోయే నత్రజని మొత్తాన్ని తగ్గిస్తుందని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి మానస, ఆత్మ కమిటీ డైరెక్టర్ గోవిందరావు, వ్యవసాయ విస్తర్ణాధికారులు రాము, బందం రజిత, పండగ అనూష, మరీదు త్రివేణి, గోగుల హరికృష్ణ ,నాగసాయి, హుస్సేన్‌సాహెబ్, ఎరువుల డీలర్లు రాజు, మందా గోపాలరావు, రైతులు పాల్గొన్నారు.

క్షయ నిర్మూలనకు కృషి చేయాలి



కల్లూరు: పాఠశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, వైద్యాధికారులు

మధిర/కల్లూరు: క్షయవ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని దెందుకూరు పీహెచ్‌సీ వైద్యులు సాయి పృధ్వీరాజ్ నాయక్ తెలిపారు. ఆయుస్మాన్ ఆరోగ్యం కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని మహాదేవపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించి గ్రామస్తులకు పరీక్షలు చేశారు. అదే విధంగా ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ ప్రోగ్రాం డాక్టర్ నవ్యకాంత్ ఆధ్వర్యంలో పల్లె దావఖాన వైద్యుడు వినిత్ వైద్యపరీక్షలు నిర్వహించి.. అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వారం రోజులకు పైబడి జ్వరం, ఎడతెరపిలేకుండా దగ్గు రావటం, చెమటలు పట్టడం, ఆకలి మందగించటం వంటి లక్షణాలు కల్గిన వారికి క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలను నిర్వహించటం జరుగుతుంన్నారు. ఈ కార్యక్రమంలో మధిర టీబీ యూనిట్ సూపర్‌వైజర్ సందీప్, పల్లె దవాఖానా సిబ్బంది, పీహెచ్‌సీ ఆరోగ్య సిబ్బంది, హెల్త్ ఎడ్యుకేటర్ వేణుగోపాల్, టీబీ నోడల్ అధికారి రామారావు, సూపర్‌వైజర్ సురేష్, కళాశాల ప్రిన్సిపల్ కనకదుర్గ, ఏఎన్ఎం భారతి, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి



విద్యార్థులకు యూనిఫాం అందిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహారావు

మధిర: విద్యార్థులు క్రమశిక్షణతో చదివి, ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు అన్నారు. గురువారం మధిరలోని తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాల విద్యార్థులకు యూనిఫాం, టై, బెల్టులను పంపిణీ చేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా, వైద్య రంగాలపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తుందన్నారు. యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్ పేరుతో ప్రతి నియోజకవర్గంలో రూ.200 కోట్ల వ్యయంతో అంతర్జాతీయ ప్రమాణాలతో పాఠశాలలను నిర్మించటం జరుగుతుందని తెలిపారు. గురుకుల విద్యార్థులకు డైట్, కాస్మోటిక్ ఛార్జీలను పెంచటం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు అద్దంకి రవికుమార్, బాణావత్ వెంకటరమణ నాయక్, కాంగ్రెస్ నాయకులు సత్యంబాబు, వెంకటేశ్వరరెడ్డి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఖర్గే సభను విజయవంతం చేయాలి

తల్లాడ/ఎర్రుపాలెం: హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో ఈ నెల 4న జరుగనున్న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సభను కాంగ్రెస్ పార్టీ, అనుబంధ సంఘాలు పాల్గొని విజయవంతం చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షులు కాపా సుధాకర్, వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి గురువారం విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు.

వితరణల వెల్లువ..

విద్యార్థులకు బూట్లు, టై, బెల్టులు..



టై, బెల్టులను అందిస్తున్న ఎంఈఓ అబ్రహం, ఉపాధ్యాయులు

కొణిజర్ల: మండలంలోని చిన్నగోపతి, అమ్మపాలెం పాఠశాలల్లో అమ్మపాలెం గ్రామ మాజీ సర్పంచ్ చిలుకూరి అచ్యుత్ ఆర్థిక సాయంతో 75మంది విద్యార్థులకు బూట్లు, సాక్సులు, టై, బెల్టులను ఎంఈఓ డి.అబ్రహం అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పురుషోత్తం రెడ్డి, భాష్యా, సతీష్, నాగేశ్వరరావు, సురేష్, సుభాషిణి, సీఆర్పీ లక్ష్మయ్య పాల్గొన్నారు.

ఆశాజ్యోతి ఆర్థిక సాయంతో..

మండలంలోని బస్వాపురం, లింగగూడెం, చిన్న మునగాల, తనికెళ్ల ఉన్నత పాఠశాల, లక్ష్మీపురం పాఠశాలల విద్యార్థులకు ఆశాజ్యోతి అందించిన ఆర్థికసాయంతో గురువారం బ్యాగులు, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు.

బియ్యం..

కారేపల్లి: మండలంలోని ఉసిరికాయలపల్లి గ్రామానికి చెందిన సీపీఐ గ్రామ శాఖ కార్యదర్శి అమీర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కాగా.. బాధిత కుటుంబానికి మండల, గ్రామ శాఖల కాంగ్రెస్ పార్టీల ఆధ్వర్యంలో కింటా బియ్యాన్ని గురువారం వితరణగా అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు మేదరి టోనీ, సొసైటీ డైరెక్టర్ ఐలయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

టై, ఐడీ కార్డులు..



టై, ఐడీకార్డులతో విద్యార్థులు

ఏన్కూరు: మండలంలోని బురదరాఘవాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులందరికీ హెచ్ఎం సాగి సుజాత, సహోపాధ్యాయులు రామారావు రూ.8వేలు అందించారు. ఆ నగదుతో 60మంది విద్యార్థులకు టై, ఐడికార్డులు అందించారు.

ప్రభుత్వాస్పత్రిలో పండ్లు, రొట్టెలు..

కల్లూరు: మండలంలోని ఎర్రబోయినపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు పోట్రు అర్జునరావు కుమారుడు చక్రి జన్మదినం సందర్భంగా కల్లూరు పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి చక్రికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నీరజాదేవి, నాయకులు ప్రభాకర్, అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

పీర్ల సావిడికి ఇన్వర్టర్ బ్యాటరీ..

చింతకాని: మండలంలోని నేరడ గ్రామంలోని పీర్ల సావిడికి గ్రామ మత్స్య సహకార సంఘం సభ్యులు ఇన్వర్టర్ బ్యాటరీని గురువారం వితరణగా అందజేశారు. దీంతో సంఘం సభ్యులను ముస్లిం పెద్దలు అభినందించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి గోపాలరావు, సీపీఐ నాయకులు, ముస్లిం పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

మధిర: ప్రపంచ టూవీలర్ మెకానిక్ దినోత్సవం సందర్భంగా మధిర పట్టణ టూవీలర్ మెకానిక్ యూనియన్ అధ్యక్షుడు సాంబిరెడ్డి ఆధ్వర్యంలో మదర్ థెరిస్సా మానసిక వికలాంగుల కేంద్రంలో గురువారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షుడు సుకూర్, కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి మీరా, ప్రచార కార్యదర్శి జాన్, సభ్యులు గఫూర్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటికి వినతి..



మంత్రి శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న కల్లూరు గ్రామస్తులు

కల్లూరురూరల్: కల్లూరు మున్సిపల్ కార్యాలయాన్ని నాగార్జునసాగర్ కాలువ పక్కన గల పాత బస్టాండ్ స్థలంలో నిర్మించాలని కల్లూరుకు చెందిన పలువురు రాష్ట్ర రెవెన్యూశాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని గురువారం ఖమ్మం క్యాంప్ కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందించారు. ప్రస్తుత భవనం ఇరుకుగా ఉన్నందున.. పాతబస్టాండ్‌లో నిర్మించాలని కోరారు. అదే విధంగా కల్లూరుకు పాలిటెక్నిక్, డిగ్రీ కళాశాలలు మంజూరు చేయించాలని, టీటీడీ కల్యాణమండపం వెనుక భాగంలో ఉన్న రెండెకరాల ప్రభుత్వ స్థలంలో పేదలకు డబుల్ ఇళ్లు నిర్మించాలని కోరారు.

5నుంచి సీపీఎం శిక్షణా తరగతులు

కారేపల్లి: మండలంలోని గాంధీనగర్ గ్రామంలో ఈ నెల 5, 6 తేదీల్లో సీపీఎం శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు సీపీఎం మండల కార్యదర్శి నరేంద్ర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు రోజులు పాటు సీపీఎం మండల కార్యకర్తలకు వివిధ అంశాలపై తరగతులు బోధించటం జరుగుతుందన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం..

చింతకాని: చింతకాని తహసీల్దార్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కరుణాకర్ రెడ్డిని కాంగ్రెస్, టీడీపీ, బీఆర్ఎస్, బీజేపీ మండల నాయకులు గురువారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్, టీడీపీ, బీఆర్ఎస్, బీజేపీ పార్టీ మండల అధ్యక్షులు వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, పెంట్యాల పుల్లయ్య, కొండా గోపి, ఆత్మ కమిటీ డైరెక్టర్ గోవిందరావు, మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు భాస్కర్ పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

సత్తుపల్లిరూరల్: దశాబ్ద కాలంగా పెండింగ్‌లో ఉన్న విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని టీఎస్‌జీఆర్ఈఏ(తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విశ్రాంత ఉద్యోగుల సంఘం) సత్తుపల్లి యూనిట్ విజ్ఞప్తి చేసింది. గురువారం సత్తుపల్లిలో నిర్వహించన సమావేశంలో.. ఆ సంఘంజిల్లా అసోసియేట్ అధ్యక్షుడు వి.చెంచిరెడ్డి, సత్తుపల్లి యూనిట్ అధక్ష, ప్రధాన కార్యదర్శులు కేశవరెడ్డి, బద్రుద్దీన్ పాల్గొని బుధవారం హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర కార్యవర్గ తీర్మాణ వివరాలను తెలిపారు. విశ్రాంత ఉద్యోగులకు నగదు రహిత వైద్య సేవలు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

సంక్షిప్త సమాచారం

'అధికార పార్టీ నాయకుల కక్షసాధింపు'

మధిర: అధికార పార్టీ నాయకులు కక్షసాధింపు చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు సీపీఎం మధిర డివిజన్ కార్యదర్శి మడపల్లి గోపాలరావు తెలిపారు. మండల పరిధిలోని తొండల గోపారం గ్రామ పంచాయతీ పరిధిలోని తొర్లపాడు గ్రామస్తులు మధిర ఎంపీడీఓ, ఆర్అండ్‌బీ కార్యాలయాల ఎదుట గురువారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో రోడ్డు పక్కన నిర్మించుకున్న మద్దాల ఏబు ఇంటిని తొలగించాలని ఆర్అండ్‌బీ అధికారుల ఆదేశాలతో గ్రామ పంచాయతీ కార్యదర్శి నోటీసులు ఇవ్వటం సరైంది కాదన్నారు. గ్రామంలో అన్యాక్రాంతమైన దళితుల ఇళ్లస్థలాలకు వెంటనే హద్దులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి మందా సైదులు, జిల్లా కమిటీ సభ్యులు వీరయ్య, డివిజన్ నాయకులు రామనర్సయ్య, ఎర్రుపాలెం మండల కార్యదర్శి ప్రభాకర్, పట్టణ కార్యదర్శి మురళి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో సోదరుడిని చేర్పించిన అధ్యాపకురాలు

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి ప్రభుత్వ ఎస్‌బీఎస్ జూనియర్ కళాశాలలో ఇంగ్లీష్ అధ్యాపకురాలిగా ఇటీవల టీజీపీఎస్సీ ద్వారా నియామకం పొందిన నిహారిక తన సోదరుడు అభినయ్ కృష్ణను స్థానిక ప్రభుత్వ బాలుర హైస్కూల్‌లో గురువారం చేర్పించారు. హెచ్ఎం ఎం.రామ్మోహన్‌రావు అడ్మిషన్ పత్రాన్ని అందించారు. ఈ పాఠశాలలో ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ పథకాలు ఉండటంతో పాటు ప్రభుత్వ విద్యపై నమ్మకంతో చేర్పించినట్లు ఆమె తెలిపారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాజ్యాంగ పరిరక్షణయాత్ర

ఎర్రుపాలెం: మండలంలోని బనిగండ్లపాడు గ్రామంలో గురువారం రాత్రి జైబాపూ, జై భీమ్ సమ్విదాన్ రాజ్యాంగ పరిరక్షణ యాత్రను కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నిర్వహించారు. ఈ యాత్రను మండల కమిటీ అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

పంచాయతీ పేరు మార్పుపై సంబరాలు

ఎర్రుపాలెం: మండలంలోని భీమవరం హరిజనవాడ గ్రామ పంచాయతీ పేరును విద్యానగర్‌గా పేరు మార్పు చేసి ప్రభుత్వం గెజిట్ చేసింది. ఈవిషయమై గురువారం గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ కోట వజ్రమ్మ, కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. మాజీ సర్పంచ్ వజ్రమ్మ మాట్లాడుతూ.. గ్రామంలో ఎంతోమంది దళితులు విద్యావంతులుగా ఉన్నారు. ప్రభుత్వానికి చేసిన విజ్ఞప్తి మేరకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చొరవతో తమ ఆశ నెరవేరిందన్నారు. కార్యక్రమంలో నాయకులుతదితరులున్నారు.

పీహెచ్‌సీలో సమస్యలు పరిష్కరించాలి



గంగారం మీటింగ్‌హాల్ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఐద్వా కమిటీ సభ్యులు

సత్తుపల్లిరూరల్/కల్లూరు: మండలంలోని గంగారం ప్రాథమిక ఆరోగ్యంలోని, కల్లూరు ప్రభుత్వాస్పత్రిలోని సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఐద్వా జిల్లా నాయకులు కోరారు. గురువారం సత్తుపల్లి మండలం గంగారం పీహెచ్‌సీని ఐద్వా బృందం సందర్శించింది. రెండేళ్లుగా ఆగిపోయిన మీటింగ్ హాల్‌నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని కోరారు. అదే విధంగా కల్లూరు ఆస్పత్రిని ఐద్వా జిల్లా కమిటి సభ్యురాలు శీలం పకీరమ్మ, మండల ప్రధాన కార్యదర్శి కృష్ణవేణిలు సందర్శించి సమస్యలు పరిష్కరించాలన్నారు. రోగులతో మాట్లాడి సమస్యలను వైద్యలకు వివరించారు. అన్ని గ్రామాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కమిటీ సభ్యులు శీలం తరుణ, కృష్ణవేణి,జాజిరి జ్యోతి, కుమారి, నాగమణి, రజిని, శీలం సత్యానారాయణరెడ్డి, తన్నీరు కృష్ణార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసం అందేనా ?

- కొలిక్కి రాని లబ్ధిదారుల ఎంపిక
- దరఖాస్తుదారులు ఎక్కువ.. యూనిట్లు తక్కువ
- అయోమయంలో అధికార యంత్రాంగం



బోనకల్ మండల పరిషత్ కార్యాలయం

బోనకల్: రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల కొరకు ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన రాజీవ్ యువ వికాస పథకం వికసించేనా? అని యువత, నిరుద్యోగులు, మేథావులు అంతర్మధనం చెందుతున్నారు. ఎంపిక ప్రక్రియలను అధికారులు నిర్వహించాల్సి ఉండగా గ్రామాల్లో అధికార పార్టీ నాయకులే జాబితాలను తయారు చేసి పంపినట్లు జోరుగా చర్చ జరుగుతుంది. అధికారులది ప్రేక్షక పాత్ర తప్ప వారి జోక్యం పూర్తిస్థాయిలో లేకుండా చేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

మండలవ్యాప్తంగా వివరాలిలా..

మండలంలోని 3,506మంది యువతీ, యువకులు ఈ పథకానికి దరఖాస్తు చేసుకున్నారు. వంద రకాల వ్యాపారాల నిర్వహణకు సంబంధించి లక్ష రూపాయల నుంచి నాలుగు లక్షల వరకు యూనిట్‌కు చెల్లించడం జరుగుతుంది. 60 నుంచి 80శాతం సబ్సిడీ వస్తుంది. మండలానికి దాదాపు 700 యూనిట్ల కేటాయింపు ఉంటుందని అంచనా.. పథకం కింద దరఖాస్తులు తీసుకోవడంతో పాటు జాబితాలను జిల్లాకు పంపించినా ఇంత వరకు మంజూరిపై ఇంకా అధికారిక ప్రకటన రాలేదు. దీంతో దరఖాస్తుదారులు యూనిట్ల మంజూరు కొరకు పడిగాపులు కాస్తున్నారు. నిబంధనల మేరకు వ్యాపారం చేసుకునే వారికి మాత్రమే పథకాన్ని వర్తింప చేయాలి. కాని రాజకీయ జోక్యం ఉండటంతో వాస్తవ లబ్ధిదారులకు నష్టం జరిగే అవకాశం కూడా ఉంటుందన్న బావనను పలువురు వ్యక్తం చేస్తున్నారు.

త్వరలోనే లబ్ధిదారుల జాబితా..



తొందరలోనే ఎంపికైన లబ్ధిదారుల జాబితా వస్తుంది. అన్ని అర్హతలను పరిశీలించిన తరువాతనే పకడ్బంధీగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ఉంటుంది. అపోహలు, అసత్య ప్రచారాలు నమ్మొద్దు. వాస్తవంగా యూనిట్లు గ్రౌండు చేసుకునే వారికే పథకం వర్తిస్తుంది.

– ఆర్.రమాదేవి, ఎంపీడీఓ